పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 | సంచిక : 716 | పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు | ఎడిటర్ : ఎస్. మస్తాన్ | ఆదివారం 13.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

### జనవరి 1 నుంచి

# హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్: సీఎం

**అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపునివ్వాలని కేంద్రాన్ని కోరిన సీఎం**




- రూ.249 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు ప్రారంభం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో వైద్య రంగానికి కొత్త ఊపు వచ్చిందన్న చంద్రబాబు
- కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ **తరువాయి 2లో**



2లో

### సాగునీటి ప్రాజెక్టులపై

## చంద్రబాబు చిత్తశుద్ధి అమోఘం

- సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చొరవను కొనియాడిన కేంద్ర మంత్రి నడ్డా
- అమరావతి క్వాంటం బయో వ్యాలీకి కేంద్రం పూర్తి సహకారం
- ఏపీ 'సంజీవని' కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో పరిశీలిస్తామన్న నడ్డా
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ సురక్షితంగా ఉందని ప్రశంస
- 'వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం' అనే నినాదాన్ని సమర్థించిన కేంద్ర మంత్రి

# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి




- సహకార స్ఫూర్తితోనే బ్రిక్స్ ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో నేతల భేటీ
- 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'కు ఏకగ్రీవంగా ఆమోదం
- ఐక్యత చాటుతూ వృక్షోత్సవంలో పాల్గొన్న ప్రపంచ నేతలు
- బ్రిక్స్ 20 ఏళ్ల వేడుకల సందర్భంగా రెండు పోస్టల్ స్టాంపుల విడుదల

2లో



### క్యాబ్ డ్రైవర్ల సమ్మె

### శంషాబాద్‌లో ప్రయాణికుల అవస్థలు

- సమ్మె బాట పట్టిన సుమారు 25,000 మంది డ్రైవర్లు
- ప్రభుత్వ జీవో 46 అమలు చేయాలని ప్రధాన డిమాండ్
- ఓలా, ఉబెర్, రాపిడో ఎయిర్‌పోర్ట్ రైడ్స్‌ను బహిష్కరించిన యూనియన్
- కిలోమీటర్‌కు రూ. 21 బదులు రూ. 12 మాత్రమే ఇస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ **తరువాయి 2లో**

### గణేశ్ మండపాలకు

## అదానీ పవర్ ఆఫర్



- ముంబై గణేశ్ మండపాలకు రెసిడెన్షియల్ ధరలకే విద్యుత్
- దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే తాత్కాలిక కనెక్షన్ మంజూరు
- గతేడాది 1000కి పైగా మండపాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా
- 167 విగ్రహ నిమజ్జన ప్రాంతాల్లో 2,958 ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు
- భక్తుల భద్రత కోసం నిర్వాహకులకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ

2లో

### ఢిల్లీ చేరిన జిన్‌పింగ్..

## ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగు

- బ్రిక్స్ సదస్సులో పాల్గొననున్న జిన్‌పింగ్
- మోదీ-జిన్‌పింగ్ మధ్య జరగనున్న ద్వైపాక్షిక భేటీ
- గల్వాన్ తర్వాత సంబంధాలపై చర్చకు ప్రాధాన్యం
- సరిహద్దుల్లో శాంతిపై భారత్ స్పష్టమైన వైఖరి
- విభేదాలను పరిష్కరించేందుకు చైనా సిద్ధమని ప్రకటన



2లో

### ఎల్ఓసీ వద్ద ప్రశాంతత

# ఫేక్ న్యూస్‌పై ఆర్మీ స్పష్టత



- ఎల్ఓసీ వద్ద ఉగ్ర కార్యకలాపాలు పెరిగాయన్న వార్తలను ఖండించిన ఆర్మీ
- కుప్వారా, బారాముల్లాలో ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారన్నది తప్పుడు ప్రచారం
- సోషల్ మీడియాలో పాకిస్తాన్ ఆధారిత ఖాతా దుష్ప్రచారం చేస్తోందని వెల్లడి
- సైన్యం మోహరింపు పెరిగిందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ
- సమాచారాన్ని నిర్ధారించుకున్నాకే షేర్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి

2లో



### అమెరికాకు కౌంటర్

## ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం

- అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా ఆగ్రహం
- ప్రతిస్పందనగా తూర్పు సముద్రంలోకి పలు బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం
- కొరియా ద్వీపకల్పంలో మరోసారి పెరిగిన ఉద్రిక్తత

కొరియా ద్వీపకల్పంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ కలిసి నిర్వహించిన "ఫ్రీడమ్ ఎడ్జ్" త్రైపాక్షిక సైనిక విన్యాసాలు ముగిసిన ఒక్క రోజు **తరువాయి 2లో**

# జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్: సీఎం

వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. నివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి.

*** డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో అభివృద్ధి పరుగులు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

**ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం**

ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీవెల్తీహ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

**అమరావతి.. భవిష్యత్ టెక్నాలజీ హబ్**

అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.




# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి

సహకార స్ఫూర్తితో ముందుకు సాగుతూ, మరింత సమ్మిళితమైన, సంపన్నమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు బ్రిక్స్ సభ్యదేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం ప్రారంభమైన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యతకు, ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఈ వేదిక నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల అధినేతలు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన వృక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో పాటు ఇతర సభ్య, భాగస్వామ్య దేశాల నేతలు ప్రధాని మోదీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నేతలందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని సామూహిక చిత్రానికి (గ్రూప్ ఫొటో) పోజులిచ్చి, తమ ఐక్యతను చాటిచెప్పారు. సదస్సులో భాగంగా 'సమ్మిళిత ప్రపంచ పాలన, బహుపాక్షికతను బలోపేతం చేయడం' అనే అంశంపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో "న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు ప్రత్యేక పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "ఈ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను సత్ఫలితాలుగా మార్చడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చిత్తశుద్ధి అమోఘం

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీనీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.

*** అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ**

రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

*** సంజీవని'పై ప్రశంసలు.. జాతీయ స్థాయిలో పరిశీలన**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

*** చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం**



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

## క్యాబ్ డ్రైవర్ల సమ్మె

# శంషాబాద్‌లో ప్రయాణికుల అవస్థలు

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు. ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్ల ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు. ఈ అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. "మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

# గణేశ్ మండపాలకు అదానీ పవర్ ఆఫర్

ముంబైలో త్వరలో ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాల సందర్భంగా నగరంలోని మండపాలకు అండగా నిలుస్తున్నట్లు అదానీ ఎలక్ట్రిసిటీ ప్రకటించింది. ఉత్సవాల కోసం ఏర్పాటు చేసే మండపాలకు నివాస గృహాలకు వర్తించే ధరలకే (రెసిడెన్షియల్ రేట్లు) తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే కనెక్షన్ మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. పండగ స్ఫూర్తిని నిరంతరాయ విద్యుత్‌తో జరుపుకునేలా చూడటమే తమ లక్ష్యమని అదానీ ఎలక్ట్రిసిటీ ప్రతినిధి తెలిపారు. "గణేశ్ మండపాలకు నమ్మకమైన తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు అందించడం ద్వారా ఉత్సవాలు ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేలా చూడాలనుకుంటున్నాం. మా వినియోగదారులకు సేవ చేయాలన్న మా నిబద్ధతకు ఇది నిదర్శనం" అని ఆయన వివరించారు. తాత్కాలిక కనెక్షన్ కోసం మండపాల నిర్వాహకులు తమ అధికారిక వెబ్‌సైట్ adanielectricity.com లోని 'న్యూ కనెక్షన్' విభాగాన్ని సందర్శించాలని సూచించింది. "గతేడాది నగరవ్యాప్తంగా 1,000కి పైగా గణేశ్ మండపాలకు నిరంతరాయ విద్యుత్‌ను విజయవంతంగా అందించాం. ఈసారి కూడా కనెక్షన్ల ఆమోదాన్ని వేగవంతం చేయడానికి, పండగ మొత్తం నమ్మకమైన సరఫరాను కొనసాగించడానికి పూర్తి ఏర్పాట్లు చేశాం. ఏవైనా సమస్యలు తలెత్తితే తక్షణమే స్పందించేందుకు మా క్విక్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి" అని ప్రతినిధి తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. మండపాలలో ఎలక్ట్రికల్ వైరింగ్ కోసం అధీకృత లైసెన్స్ ఉన్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సేవలను మాత్రమే వినియోగించుకోవాలని నిర్వాహకులను కోరింది. అంతేకాకుండా, నగరంలోని 167 విగ్రహ నిమజ్జన ప్రాంతాల్లో 2,958 ఫ్లడ్‌లైట్లతో వెలుగులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతినిధి వెల్లడించారు.

**నిర్వాహకులకు భద్రతా సూచనలు**

మండపాల వద్ద వైరింగ్ సిద్ధంగా ఉంచుకోవడం, మీటర్ క్యాబిన్‌లోకి అధీకృత సిబ్బందిని మాత్రమే అనుమతించడం, ప్రామాణిక వైర్లు, స్విచ్‌లు వాడటం, అత్యవసర పరిస్థితుల కోసం ఒకే ఐసోలేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వైర్లకు స్టాండర్డ్ ఇన్సులేషన్ టేప్ వాడాలని, మీటర్ క్యాబిన్ వద్ద ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ఉంచాలని, సరైన ఎర్తింగ్ ఉండేలా చూసుకోవాలని తెలిపింది. అదేవిధంగా అనుమతి లేకుండా విద్యుత్ సరఫరాను పొడిగించడం, వైరింగ్‌లో అనవసరమైన జాయింట్లు వేయడం, లోడ్ కంటే ఎక్కువ విద్యుత్‌ను వాడటం వంటివి చేయవద్దని హెచ్చరించింది. మీటర్ క్యాబిన్ ప్రవేశానికి అడ్డంకులు సృష్టించడం, ఫ్లడ్‌లైట్లు, ఫ్యాన్లు, ఇన్సులేటెడ్ జాయింట్ల వద్దకు ప్రజలను అనుమతించడం వంటివి చేయరాదని స్పష్టం చేసింది.

# ఎల్‌ఓసీ వద్ద ప్రశాంతత ఫేక్ న్యూస్‌పై ఆర్మీ స్పష్టత

జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయని, అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయమని సైన్యం ఆదేశించిందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత సైన్యం తీవ్రంగా ఖండించింది. ఇదంతా నిరాధారమైన, తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇండియన్ ఆర్మీ అధికారిక ఫ్యాక్ట్‌చెక్ విభాగం నేడు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా జిల్లాల్లోని ప్రధాన సైనిక స్థావరాల సమీపంలో నివసించే వారిని ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ కోరినట్టుగా కొన్ని నివేదికలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ వార్తలకు, నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదుల కదలికలు పెరిగాయనడానికి సంబంధం ఉందంటూ `@KashmirIntel_` అనే ఎక్స్ ఖాతా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆర్మీ తెలిపింది. ఈ ఖాతా పాకిస్థాన్ ఆధారిత ప్రచార ఖాతా అని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే దీని లక్ష్యమని పేర్కొంది. "నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయనడం, అసాధారణ స్థాయిలో సైన్యం మోహరింపు జరుగుతోందనడం పూర్తిగా అవాస్తవం" అని ఆర్మీ అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రచార ఖాతా ఐరోపా కేంద్రంగా పనిచేస్తూ, కశ్మీర్‌లోని పరిస్థితులపై తప్పుడు కథనాలను సృష్టించడానికి ప్రయత్నిస్తోందని వివరించారు. గతంలోనూ పలుమార్లు ఈ ఖాతా నుంచి ఇలాంటి నకిలీ వార్తలు వ్యాప్తి అయ్యాయని గుర్తుచేశారు.

# అమెరికాకు కౌంటర్ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం

కొరియా ద్వీపకల్పంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ కలిసి నిర్వహించిన "ఫ్రీడమ్ ఎడ్జ్" త్రైపాక్షిక సైనిక విన్యాసాలు ముగిసిన ఒక్క రోజుకే ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వారి విన్యాసాలను రెచ్చగొట్టే చర్యగా భావిస్తున్న ప్యోంగ్‌యాంగ్, తనదైన శైలిలో ప్రతిస్పందించింది. దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ (జేసీఎస్) తెలిపిన వివరాల ప్రకారం, శనివారం ఉదయం 5:20 గంటలకు ఉత్తర కొరియాలోని వోన్‌సాన్ ప్రాంతం నుంచి అనేక స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. అవి సుమారు 250 కిలోమీటర్లు ప్రయాణించి తూర్పు సముద్రంలో (సీ ఆఫ్ జపాన్) కూలిపోయాయి. ఈ ప్రయోగం తర్వాత దక్షిణ కొరియా సైన్యం అప్రమత్తమైంది. మరిన్ని ప్రయోగాలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో, అమెరికా, జపాన్‌లతో సమాచారాన్ని పంచుకుంటూ పరిస్థితిని సమీక్షిస్తోంది. అయితే, ఈ క్షిపణుల వల్ల అమెరికా లేదా దాని మిత్రదేశాలకు తక్షణ ముప్పు ఏదీ లేదని యూఎస్ పసిఫిక్ కమాండ్ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లు కలిసి "ఫ్రీడమ్ ఎడ్జ్" పేరుతో వైమానిక, సముద్ర, సైబర్ డొమైన్‌లలో తమ సైనిక సామర్థ్యాలను పరీక్షించుకున్నాయి. ఈ విన్యాసాలను ఉత్తర కొరియా తీవ్రంగా వ్యతిరేకించింది. దీనికి బదులుగా "శక్తిమంతమైన ప్రతిచర్యలు" ఉంటాయని ఆ దేశ రక్షణ మంత్రి కిమ్ సాంగ్‌గి ముందే హెచ్చరించారు. ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలు చేయడం ఇది కొత్తేమీ కాదు. గత నెల ఆగస్టు 20న కూడా సుమారు 10 క్షిపణులను ప్రయోగించింది. ఈ ప్రయోగాలు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ఢిల్లీ చేరిన జిన్‌పింగ్.. ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగు

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌కు చేరుకున్నారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం న్యూఢిల్లీకి వచ్చిన ఆయన.. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జిన్‌పింగ్‌తో పాటు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ కై కీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్‌కు వచ్చారు. ఈ విషయాన్ని చైనాలో భారత రాయబారి షూ ఫెయిహోంగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 2020లో గల్వాన్ ఘర్షణల తర్వాత భారత్‌చైనా సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని భారత్ పదేపదే స్పష్టం చేస్తోంది.

## సంపాదకీయం

# విశ్వవేదికపై అమరావతి జెండా

భారతదేశం ఒక కొసన అమరావతి జెండా రెపరెపలాడింది. అయిదు కోట్ల ఆంధ్రుల గుండె ఉప్పొంగింది. ఓ పది మంది గుండె బాధతో మూలిగి ఉండవచ్చు, కానీ అమరావతి గెలిచింది. అమరావతి రైతుల అకుంఠిత దీక్ష గెలిచింది. వికృత రాజకీయ క్రీడలో అయిదు సంవత్సరాలు నలిగిన అమరావతి, కూటమి గెలుపుతో మళ్లీ చిగురించింది. రోజుకి 50 వేలమంది కార్మికులు పనిచేస్తూ శరవేగంగా ముందుకు దూసుకువెళుతోంది. 'న్యూయార్క్ టైమ్స్' లాంటి పత్రికల్లో ఈ మధ్య అమరావతి ప్రస్తావన వచ్చింది. భారతదేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాన్ని నిర్మించటానికి ఒక వ్యక్తి చేస్తున్న ప్రయత్నం అంటూ చంద్రబాబు నాయుడి గురించి రాశారు. అందులో చంద్రబాబు నాయుడిని ప్రశంసించటం ఒక్కటే చేసినట్లు కాదు, అమరావతి గురించిన ప్రశంసే ఎక్కువ. ఇంకా పూర్తిగా నిర్మాణం కాని ఒక నగరం అప్పడే విదేశీ పత్రికలలో చోటు సంపాదించింది; అది కూడా ఏదో చిన్నాచితకా పత్రికలో కాకుండా ప్రపంచ ప్రఖ్యాత వార్తా పత్రికలో రావటం సాధారణ విషయం కాదు. అమరావతిని భారతదేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా అభివర్ణించటం ఆంధ్రులకు గర్వకారణం. భారతదేశంలో నగర ప్రణాళిక విభాగంలో అమరావతి నిర్మాణం అనేది ఒక అతి పెద్ద ప్రయోగం అంటూ 'గ్రీన్‌ఫీల్డ్ సిటీ' అని ఆ పత్రిక అభివర్ణించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాదును ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన చంద్రబాబు నాయుడికి, రాష్ట్ర విభజన తరువాత శూన్యం నుండి అమరావతిని ఒక ఆధునిక మహానగరంగా నిర్మించటం ఒక చారిత్రక అవసరమై, ఒక సవాలుగా మారింది అనేది వారి కథనం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ రాజధాని ప్రస్తావన ఎక్కడో కాశ్మీర్‌లో ఉన్నవారి నోట విన్నందుకు ఇంతగా ఎందుకు సంతోషపడుతున్నారు అంటే : ఏదో ఒక కారణం చేత ఆంధ్రప్రదేశ్ ప్రజలు గుర్తింపు సంక్షోభం (Identity Crisis)తో బాధపడ్డారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో అంతర్భాగంగా ఉన్నప్పుడు మద్రాసులో తెలుగువారు తక్కువగా ఉన్నప్పటికీ మద్రాస్ ఆర్థిక వ్యవస్థ, వ్యాపారం, భూముల యాజమాన్యంతో పాటు విద్యారంగంలో తెలుగువారి ప్రాబల్యం చాలా ఎక్కువగానే ఉండేది. నాటి మద్రాస్ ప్రెసిడెన్సీ పరిధిలో రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలు ఉండటం, మద్రాసు సరిహద్దులకు ఆంధ్రప్రాంతం దగ్గరగా ఉండటం వలన ఇప్పుడు హైదరాబాదులో మాదిరిగానే వ్యాపారవేత్తలు, న్యాయవాదులు, రాజకీయనాయకులు చెప్పకోదగ్గ స్థాయిలో ఉండేవారు ఆంధ్రావారు. అందుకే భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడాలని యోచించిన వారు కూడా "మద్రాస్ మనదే" అనే నినాదంతో మద్రాసు పైన ఆంధ్రుల హక్కుల కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష సందర్భంలో మద్రాసు పైన హక్కు కూడా ఒక అంశమే. మద్రాసు పైన హక్కుల కోసం ఆంధ్రులు ఆందోళనలు చేస్తూ ఉండగా సి.రాజగోపాలాచారి "మద్రాసుకు ఆంధ్రులకు ఎటువంటి సంబంధం లేదు" అని తేల్చేశారు. రాజగోపాలాచారి ప్రకటనతో ఆంధ్రుల గుండె గాయపడినప్పటికీ, నిస్సహాయ స్థితిలో కనీసం ఉమ్మడి రాజధానిగానైనా కొనసాగించాలని కోరారు. అది కూడా నెరవేరకుండానే ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కాందిశీకుల మాదిరిగా తట్టాబుట్టా సర్దుకుని గుడారాలు వేసుకుని పరిపాలన చేసుకోవటానికి కర్నూలు రాజధానిగా బాధాతప్త హృదయాలతో వెనుతిరిగారు. ఆరోజునే కర్నూలే రాజధానిగా ఉండిపోతే చరిత్ర ఎలా ఉండేదో తెలియదు కానీ, మరలా తీసుకెళ్లి 'పెద్దమనుషుల ఒప్పందం' పేరిట తెలంగాణతో కలిపారు. తెలంగాణ రాష్ట్ర రాజధానినే ఆంధ్రులకు రాజధాని అని చెప్పారు. మరలా విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు అందరూ హైదరాబాదు చేరుకుని హైదరాబాద్ ప్రగతిలో భాగస్వాములయ్యారు. 57 సంవత్సరాలు గడిచాక హైదరాబాదును కొత్తగా ఏర్పడిన తెలంగాణకు అప్పచెప్పి కేంద్రం చేతులు దులిపేసుకున్నది. ఇక్కడే ఒక విచిత్రం జరిగింది. ఆంధ్రరాష్ట్రం కావాలని ఆంధ్రులు అడిగినప్పడు మద్రాసును వదులుకుంటేనే అని చర్చలు జరిపి, చివరకు మద్రాసును వదులుకునేలా చేశారు. దానికి పూర్తి విరుద్ధంగా కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాదును ఇచ్చి ఆంధ్రులను అక్కడి నుండి వెళ్లగొట్టారు. హైదరాబాదును వదులుకోవటం కంటే కూడా కేసీఆర్ లాంటివారు ఆంధ్రులను ఉద్దేశించి మాట్లాడిన మాటలు ఆంధ్రుల గుండెను ఎక్కువగా గాయపరిచాయి. మరొక్కసారి రాజధాని లేని రాష్ట్రానికి మూటాముల్లే సర్దుకుని నవ్యాంధ్రకు వెళ్లారు. మద్రాసు నుండి కర్నూలుకు వచ్చిన రోజున నిధులు ఇవ్వలేక ఆనాటి కేంద్ర ప్రభుత్వం హైదరాబాదుకు జతచేసింది. దగ్గర దగ్గర ఆరు దశాబ్దాలు గడిచాక మరలా హైదరాబాదు నుండి రెవెన్యూ లోటుతో రాజధాని లేని రాష్ట్ర పౌరులుగా మిగిలిపోయారు ఆంధ్రులు. నవ్యాంధ్ర నిర్మాణ బాధ్యతను నెత్తికెత్తుకున్న చంద్రబాబు నాయుడు పది సంవత్సరాలు హైదరాబాదును రాజధానిగా ఉపయోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఎప్పడైనా వదులుకోక తప్పని హైదరాబాదును మరో దశాబ్దం పాటు రాజధానిగా కొనసాగించి కేసీఆర్ లాంటివారి మాటలతో ఆంధ్రుల గుండె గాయాన్ని పెంచటం ఇష్టం లేక అమరావతిని ప్రతిపాదించారు. అప్పడు కూడా నిధులు లేవు. రెవెన్యూ లోటును పూర్తిగా పూడ్చని కేంద్రం రాజధానికి నిధులు ఇస్తుందని ఆశపడటం మరో బాధాకరమైన అంశం. చంద్రబాబు ఎలాగో తంటాలు పడి అమరావతి రైతుల త్యాగంతో పరిపాలన అవసరాల మేరకు ఒక్కొక్కటీ నిర్మించుకుంటూ వచ్చారు. ఆంధ్రుల రాజధాని కథ అంతటితో ముగిసింది అనుకున్న ఆంధ్రులకు ఆశానిపాతం గా , శాసనసభ సాక్షిగా అమరావతికి ఆమోదం తెలిపిన జగన్ మోహన్ రెడ్డి 2019 లో అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరిట ఆంధ్రులను మరలా రాజధాని సంక్షోభంలోకి నెట్టివేశారు. ఆ సమయంలో తమ భూములను త్యాగం చేసి కూడా అమరావతి రైతులు అమరావతిని ఎలా కాపాడుకున్నారో ఆంధ్రులకు తెలియనిది కాదు. తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర పుటలకెక్కింది; అమరావతి రైతుల పోరాటం ప్రపంచాన్నే విస్మయానికి గురిచేసింది. తలచుకుంటే వ్యథ; రాస్తే ఒక ఉద్గ్రంథం. మరలా కూటమి కొలువుతీరింది. పార్లమెంటు ఏకగ్రీవంగా అమరావతిని ఆమోదించింది. అయినా జగన్ మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే మరలా శాసనసభలో అమరావతికి వ్యతిరేకంగా తీర్మానం చేసి అమరావతిని లేకుండా చేస్తానంటున్నాడు. అది జరగదు కానీ, ప్రజల్లో భయం పూర్తిగా పోలేదు. తన తండ్రిని రెండు సార్లు ముఖ్యమంత్రిని చేశారు; తనను ఒకసారి ముఖ్యమంత్రిని చేశారు ఆంధ్రులు. కానీ జగన్మోహన్ రెడ్డికి ఆంధ్రుల పట్ల కృతజ్ఞత లేకపోవడం వలన రాష్ట్రానికి రాజధాని సంక్షోభం ఆరని జ్వాలగా మిగిలిపోతుందా అనే భయం ఆంధ్రులను వీడటం లేదు. అందుకే ఎక్కడో లడఖ్‌లో ఒక చిన్నారి ఆంధ్రప్రదేశ్ అని అనగానే "అమరావతి" అన్నందుకు ఆంధ్రుల గుండెలు ఉప్పొంగిపోతున్నాయి. దేశంలో అనేక కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. పాత రాష్ట్రాలకు పాత రాజధానులు ఉన్నాయి. కొత్త రాష్ట్రాలకు కొత్తగా రాజధానులు ఏర్పడ్డాయి. కానీ ఆంధ్రరాష్ట్రం మాదిరిగా రాజధాని సంక్షోభాన్ని ఏ రాష్ట్రమూ ఎదుర్కోలేదు. మద్రాసును సుసంపన్నం చేశారు, హైదరాబాదును సుసంపన్నం చేశారు; కానీ తమకంటూ స్వంత రాజధానిని నిర్మించుకోలేకపోయారు . నిర్మించుకుంటున్న దశలో స్వరాష్ట్రం వారే దానికి అడ్డుతగిలే ప్రయత్నం చేస్తున్నారు. చదువుల్లో ముందుండి, వ్యవసాయంలో అన్నపూర్ణగా పేరొంది, రెండు రాజధానుల అభివృద్ధిలో శక్తివంచన లేకుండా పాటుపడింది; కానీ ఎక్కడివక్కడే వదిలి రావలసి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని కథ ఆంధ్రులకు తరగని వ్యథ. అందుకే అమరావతి ప్రస్తావన ఎవరు తీసుకొచ్చినా ఆనందం గుండెలను తన్నుకుని వస్తుంది. ఆంధ్రుల వ్యథను, రాజధాని కథను ఇంతటితో ముగించాలని అయిదు కోట్ల ఆంధ్రుల తరఫున జగన్మోహన్ రెడ్డికి సవినయ విజ్ఞప్తి. ఆంధ్రుల రాజధానికి సంబంధించి నడిచిన కథలో ఆందోళనలు, అవమానాలు, ఛీత్కారాలు; నడుస్తున్న కథలో పోరాటాల విజయగాథలు, సంతోషాలు, నమ్మకాలు, అపనమ్మకాలు, అరాచక శక్తుల వ్యర్థ ప్రేలాపనలు..... వీటన్నిటినీ తట్టుకుని నిలబడిన అమరావతి ఆంధ్రుల రాజధాని మాత్రమే కాదు, ఆంధ్రుల గుండెచప్పడు కూడా!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

సెప్టెంబర్ 13

SEP 13

* 1929: భారత స్వాతంత్ర్య సమరయోధుడు జతీంద్ర నాథ్ దాస్ మరణం (జ. 1904).
* 1940: తెలుగు వ్యంగ్య చిత్రకారుడు జయదేవ్ జననం.
* 1960: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి జననం.
* 1969: ఆస్ట్రేలియా అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు షేన్ వార్న్ జననం.
* 1996: అమెరికన్ రాప్ కళాకారుడు తుపాక్ షకుర్ మరణం (జ.1971).
* 2012: భారత 21వ ప్రధాన



రంగనాథ్ మిశ్రా

న్యాయమూర్తి రంగనాథ్ మిశ్రా మరణం (జ. 1926).(చిత్రంలో)

### 19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు

## డిసెంబర్ కోటా విడుదల

తిరుమల: డిసెంబర్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల కోటాను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ కోసం 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో ఎంపికైన భక్తులు 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, పుష్పయాగం టికెట్లను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు డిసెంబర్ నెల ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా విడుదలవుతుంది. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.



**శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. చంద్రబాబుకు ఆహ్వానం**

తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును తితిదే ఆహ్వానించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నివాసంలో తితిదే బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకిదేవి, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర తదితరులు సీఎంను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తితిదే వేద పండితులు సీఎంకు వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై చంద్రబాబు వారితో చర్చించారు. ఈ సందర్భంగా తితిదే ఉద్యోగుల గృహస్థలాల అభివృద్ధికి సంబంధించి సీఎం చంద్రబాబుతో వీరు ప్రత్యేకంగా చర్చించారు. నిధులకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

### విజయవాడలో మంత్రి నారాయణ

## ఆకస్మిక పర్యటన

విజయవాడ: ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ విజయవాడలో ఆకస్మికంగా పర్యటించారు. వర్షపునీటి కాలువలు, డ్రెయిన్లను పరిశీలించారు. వర్షపునీరు నిలిచిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన పూడికతీత పనులను పర్యవేక్షించారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2014-19లో డ్రెయిన్ల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులను గత ప్రభుత్వం ఉపయోగించలేదన్నారు. డ్రెయిన్లలో పూడిక ఎక్కువగా చేరి నీరు నిలిచిపోతోందని, 70 యంత్రాలతో పూర్తిగా తొలగిస్తున్నామని చెప్పారు.



విజయవాడలో రూ.600 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రెండ్రోజుల్లో సిల్ట్ తొలగించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడతామన్నారు.

### అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో

## ఓటర్ల జాబితా

: **అనిల్ చంద్ర పునేఠా**

అమరావతి: షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు ఏపీ ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రజల పరిశీలన కోసం ఈ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్నామని తెలిపింది. మండల స్థాయిలో ఓటర్ల జాబితా ఆయా ఎంపీపీ కార్యాలయాల్లో, జిల్లా స్థాయి ఓటర్ల జాబితా ఆయా జడ్పీ సీఈవో కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని



పేర్కొంది. అన్ని పంచాయతీ కార్యాలయాల్లోనూ ఈ మేరకు సమాచారం అందుబాటులో ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

# అదొక దైవిక అనుభూతి.. థాంక్యూ కేరళం: పవన్ కల్యాణ్ ప్రకటన

- గత కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న పవన్ కల్యాణ్
- చికిత్స అనంతరం కేరళ ప్రజలకు, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు
- పలు ప్రాచీన ఆలయాలను సందర్శించి దైవిక అనుభూతి పొందానన్న పవన్
- సహకరించిన సీఎం, పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు
- కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యం తన పర్యటనను ప్రత్యేకంగా మార్చాయని వెల్లడి

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గత కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న సంగతి తెలిసిందే. తన పర్యటన ముగిసిన నేపథ్యంలో, కేరళలో తనకు లభించిన అనుభవాలు, ఆదరణపై ఆయన శనివారం ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, తన పర్యటన ఎంతో ప్రశాంతంగా, మధుర జ్ఞాపకాలతో సాగిందని పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా తాను తన చికిత్స కోసం కేరళలో ఉన్నానని పవన్ తెలిపారు. "కేరళ ప్రజలకు పేరుగాంచిన ఆప్యాయత, కరుణ, ఆతిథ్యాన్ని స్వయంగా అనుభవించే అవకాశం నాకు లభించింది. నా చికిత్స సమయంలో ఇక్కడ గడిపిన కాలం నాకు మానసిక స్వస్థతను, శాంతిని, ఎన్నో మధుర జ్ఞాపకాలను అందించింది" అని



ఆయన పేర్కొన్నారు. తన చికిత్స విజయవంతం చేయడంలో అంకితభావంతో కూడిన సంరక్షణ, వృత్తి నైపుణ్యం, వ్యక్తిగత శ్రద్ధ కనబరిచిన డాక్టర్ సీతారాం ఆయుర్వేదిక్ రిట్రీట్‌లోని వైద్యులు, యాజమాన్యం, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమయంలో తనకు అందిన సంరక్షణ, మద్దతుకు తాను ఎంతో రుణపడి ఉంటానని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా పలు పవిత్ర దేవాలయాలను సందర్శించే భాగ్యం కూడా తనకు కలిగిందని పవన్ కల్యాణ్ వివరించారు. "త్రిప్రయార్ శ్రీ రామస్వామి, గురువాయూర్ శ్రీ కృష్ణ, మమ్మియూర్ శ్రీ మహాదేవ, చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను సందర్శించాను. శతాబ్దాల నాటి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వంతో ముడిపడి ఉన్న ఈ ప్రాచీన ఆలయాలు నాకు గాఢమైన భక్తిని, శాంతిని, ఆత్మపరిశీలనకు అవకాశాన్ని అందించాయి. వాటి కాలాతీతమైన ఆచారాలు, పవిత్ర వాతావరణాన్ని అనుభవించడం నిజంగా దైవికమైనది, సంతృప్తినిచ్చింది. మన ప్రాచీన నాగరికతా వారసత్వానికి కేరళ ఆలయాలు సజీవ రూపాలుగా నిలుస్తాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. తన పర్యటన సాఫీగా సాగేందుకు సహకరించిన కేరళ ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ కు పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తన బస ఆసాంతం అవసరమైన ఏర్పాట్లు, సహకారం అందించిన డీజీపీ, కేరళ పోలీసులకు, త్రిస్సూర్, అలప్పుజ, కొచ్చి జిల్లాల పోలీసు బృందాలకు, సంబంధిత జిల్లా యంత్రాంగానికి, స్టేట్ ప్రొటోకాల్ విభాగానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వారి వృత్తి నైపుణ్యాన్ని, భద్రతా ఏర్పాట్లను ఆయన ప్రశంసించారు. "అన్నింటికంటే ముఖ్యంగా, కేరళ ప్రజల ఆప్యాయత, సద్భావన, అద్భుతమైన ఆతిథ్యానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. వారి వాత్సల్యం, ఇక్కడి ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభవాలు నా పర్యటనను ఎంతో ప్రత్యేకంగా మార్చాయి. కేరళ ప్రజల పట్ల ప్రగాఢమైన కృతజ్ఞత, అపారమైన గౌరవం, మధుర జ్ఞాపకాలతో ఇక్కడి నుంచి బయలుదేరుతున్నాను. థ్యాంక్యూ కేరళం" అని పవన్ తన ప్రకటనలో ముగించారు.

## ఫోన్ రిపేర్ కోసం వచ్చి..
# అమీర్‌పేట్‌లో యువతి మృతి

పంజాగుట్ట: సెల్‌ఫోన్ రిపేర్ కోసం వచ్చిన ఓ యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ అమీర్‌పేట శ్రీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వి.హేమదుర్గ (26) ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ



బంజారాహిల్స్‌లోని ఓ కార్ల కంపెనీలో పనిచేస్తోంది. తన సెల్‌ఫోన్ రిపేర్ కోసం ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకుని అమీర్‌పేటకు ర్యాపిడో బైక్‌పై బయలుదేరింది. అమీర్‌పేట బిగ్‌బజార్ వెనుక గేట్ సమీపంలోకి రాగానే ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో హేమదుర్గ అక్కడికక్కడే మృతిచెందింది. బస్సు డ్రైవర్ షేక్ అన్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు.

# దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం: మంత్రి సవిత

- బీసీ రక్షణ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న సవిత
- బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు చంద్రబాబుతోనే సాధ్యమని వ్యాఖ్య
- జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని విమర్శ

బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా,



సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

## పొన్నూరులో దారుణం.. ప్రియుడితో కలిసి
# కన్నతల్లిని హతమార్చిన యువతి

పొన్నూరు: తన ప్రేమ కార్యకలాపాలకు అడ్డు వస్తుందని సొంత తల్లిని కుమార్తె హతమార్చిన ఘటన గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక క్యాబిన్ పేటలో నివాసముంటున్న ఈపూరు లక్ష్మిని ఆమె కుమార్తె పుష్పలత.. ప్రియుడు రాజాతో కలసి అర్ధరాత్రి హత్య చేసినట్టు మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పొన్నూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వక భేటీ

- సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమావేశం
- ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన భేటీ
- మర్యాదపూర్వకంగానే సమావేశమైన ఇరువురు నేతలు
- పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏపీకి వచ్చిన నడ్డా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా



స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

## రూ.253 కోట్లతో అమరావతిలో దేశంలోనే
# అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్: ఏపీ డీజీపీ

- నేర పరిశోధనకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు వెన్నెముక లాంటివన్న డీజీపీ హరీశ్ గుప్తా
- పలు కేంద్రాల్లో ల్యాబ్‌లను ఆధునీకరిస్తున్నామని వెల్లడి
- కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే నివేదికలు అందిస్తున్నామన్న డీజీపీ



రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' (CLICK) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

# భారీ ప్యాకేజీతో పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి: అచ్చెన్నాయుడు

- అచ్చెన్నాయుడిని కలిసిన పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు
- పౌల్ట్రీ రంగం అభివృద్ధి కోసం రూ. 657 కోట్ల ప్యాకేజీ ప్రకటించామన్న అచ్చెన్న
- ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026–29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడి

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా



మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ, లోటెన్షన్ ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్ క్రమబద్ధీకరణ కల్పించామన్నారు. కొత్త ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (EC) పౌల్ట్రీ షెడ్లకు రూ.25 లక్షల వరకు, పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు 25 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందించే అవకాశం కల్పించామని తెలిపారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను స్థాపిస్తామన్నారు. పీపీపీ విధానంలో విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు కేంద్రాలుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రంతో చర్చించి నూక బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

## విశాఖలో కాలిబూడిదైన ఆర్టీసీ బస్సు..
# తప్పిన పెను ప్రమాదం

విశాఖపట్నంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోగా, ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి నెల్లూరు నుంచి ప్రయాణికులతో వచ్చిన ఈ బస్సును వాల్తేరు డిపో వద్ద నిలిపి ఉంచారు. అయితే, శనివారం తెల్లవారుజామున బస్సు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడ్డాయి. చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి



వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రయాణికులు లేని సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ముప్పు తప్పినట్లయిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- అల్పపీడనం ప్రభావంతో ఏపీలో వర్ష సూచన
- కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక
- గంటకు 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్షా లు కురుస్తాయని అంచనా
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు సూచన



బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న కొన్ని గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాగల 6 గంటల పాటు శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు ఉన్న జిల్లాల్లో అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో రాగల రెండు గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ వర్షాలతో పాటు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. పైన పేర్కొన్న మూడు జిల్లాలు మినహా మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరికల దృష్ట్యా, అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించిన టీటీడీ

- సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబును కలిసిన బీఆర్ నాయుడు, టీటీడీ సభ్యులు
- చంద్రబాబుకు వేదాశీర్వచనం పలికిన టీటీడీ వేద పండితులు
- సాలకట్ల బ్రహ్మోత్సవాలు, నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక బులెటిన్ విడుదల చేసిన టీటీడీ

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు అధికారికంగా ఆహ్వానించారు. అమరావతి సమీపంలోని ఉండవల్లి వద్ద గల సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని టీటీడీ చైర్మన్, ఈవోలతో పాటు బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకీదేవి కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు సీఎం చంద్రబాబుకు మంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను బహూకరించారు. అనంతరం తిరుమలలో త్వరలో ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై టీటీడీ నాయకత్వంతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దేశ విదేశాల నుంచి విచ్చేసే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, అన్నప్రసాద



వితరణ, లడ్డూ ప్రసాదాల నిల్వ, భద్రత మరియు పారిశుధ్య నిర్వహణపై సీఎం దిశానిర్దేశం చేశారు. తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా జరగనుండగా, ఆ తర్వాత నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ సాలకట్ల బ్రహ్మోత్సవాల వేళ స్వామివారు వివిధ అలంకారాల్లో చేసే వాహన సేవలు, విశేష ఉత్సవాలు, ముఖ్యమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయ వేళలను భక్తులకు తెలియజేసేందుకు ఇప్పటికే ప్రత్యేక బుక్‌లెట్‌ను టీటీడీ విడుదల చేసింది. ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణతో సహా గరుడ సేవ వంటి కీలక ఘట్టాల నిర్వహణకు దేవస్థానం సర్వం సిద్ధం చేస్తోంది.

## యూట్యూబర్ రమానందనపై మరో కేసు

- చీటింగ్ కేసులో యూట్యూబర్ రమానందనకు నోటీసులు
- లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10.50 లక్షలు వసూలు
- ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- ఈ నెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశం
- గతంలోనూ నందనపై పలు మోసం కేసులు

లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందనకు ప్రకాశం జిల్లా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. తన యూట్యూబ్ ఛానల్ 'నందూస్ వరల్డ్' ద్వారా నందన తెలుగు ప్రజలకు



సుపరిచితురాలు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం పేరాయపాలెంకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కోడలికి లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, నందన తమ నుంచి రూ.10.50 లక్షలు వసూలు చేశారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో చాలా మందికి ఉద్యోగాలు ఇప్పించానని చెప్పడంతో విడతల వారీగా ఈ మొత్తాన్ని ఆమెకు బదిలీ చేసినట్లు తెలిపారు. అయితే, ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో జులై 4న పోలీసులు నందనపై చీటింగ్ కేసు నమోదు చేశారు. నందనపై ఇలాంటి ఆరోపణలు రావడం ఇది మొదటిసారి కాదు. యూకేలో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు గతంలో ఎన్టీఆర్ జిల్లాలోనూ ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి జారీ అయిన లుక్‌అవుట్ నోటీసుల కారణంగా ఇటీవల హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ మోసాలతో తనకు సంబంధం లేదని, తన భర్తే ఇలాంటి వ్యవహారాలు చూసుకుంటారని విచారణ సందర్భంగా ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అల్లూరి జిల్లాలో కొట్టుకుపోయిన వంతెన.. 15 జిల్లాలకు రాకపోకల బంద్

- జీకే వీధి మండలం చిన్న గంగవరం వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన
- ఏపీ-ఒడిశా సరిహద్దులోని 15 గ్రామాలకు రాకపోకలు బంద్
- శాశ్వత ప్రాతిపదికన వంతెన నిర్మించాలని కోరుతున్న ప్రజలు

ఏపీలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు



పొంగిపొర్లుతున్నాయి. వర్షాల తీవ్రతకు జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలోని చిన్న గంగవరం వద్ద తాత్కాలికంగా నిర్మించిన వంతెన నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని దాదాపు 15 గిరిజన గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. నిత్యావసర సరుకుల రవాణాతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం ఈ 15 గ్రామాల గిరిజనులు ఈ ఒక్క వంతెనపైనే ఆధారపడి రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో 2024లో సంభవించిన వర్షాలకు ఇక్కడున్న ప్రధాన వంతెన ధ్వంసం కాగా, అధికారులు తాత్కాలిక ప్రాతిపదికన రాకపోకల కోసం ప్రత్యామ్నాయ వంతెనను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ తాత్కాలిక నిర్మాణం కూడా నీటి ఉధృతికి కొట్టుకుపోవడంతో స్థానిక గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు ఇకనైనా తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత ప్రాతిపదికన వంతెనను వెంటనే నిర్మించి తమ రాకపోకల సమస్యను పరిష్కరించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణ శాసనసభ ఈ నెల 16కి వాయిదా

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఈ నెల 16కి వాయిదా పడింది. ఈ నెల 14న వినాయక చవితి పండగ నేపథ్యంలో సభకు మూడు రోజుల పాటు విరామం ఇచ్చారు. తిరిగి 16న (బుధవారం) శాసనసభ ప్రారంభం కానుంది. మరోవైపు శాసనమండలి నిరవధిక వాయిదా పడింది.




## 22ఏ నుంచి తొలగించిన ప్రతి ఎకరాకు లెక్కలున్నాయ్: పొంగులేటి

హైదరాబాద్: ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత పాలకులు లక్షలాది ఎకరాలు చెరబట్టారని ఆక్షేపించారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వాళ్ల బండారం బయటపడుతుందని తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా శాసనసభలో పొంగులేటి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను గత పాలకులు స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. "పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ శాఖను కేసీఆర్ తనవద్దే ఉంచుకొని.. భూముల అక్రమాలకు పాల్పడ్డారు. భూములు కొల్లగొట్టేందుకే ధరణిని వాడుకున్నారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారు. దివాళా తీసిన విదేశీ సంస్థకు ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారు. వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు" అని పొంగులేటి అన్నారు.

**వారందరికీ పట్టాలు**

"రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవు. దాదాపు 125 సంవత్సరాల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టాం. ధరణి ఉన్నప్పుడు 2.49 లక్షల దరఖాస్తులు ఉండేవి. భూభారతిగా మారిన తర్వాత మరో 3 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5 లక్షల పైచిలుకు అప్లికేషన్లను పరిష్కరించాం. పరిష్కరించలేని వాటిని ఏ కారణంతో పరిష్కరించలేదో చెప్పాం. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టాం. ఆయా గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇస్తున్నాం. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తాం.

**భూమి లేకుండానే పాసుపుస్తకాలా?**

దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి... భూములు మాత్రం ఉండేవి కాదు. ధరణి చట్టం తెచ్చి తమ బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమి లేకుండానే ఆ పాసుపుస్తకాలకు రూ. కోట్ల రైతుబంధు ఇచ్చారు. భూమి లేనివారికీ రైతు బంధు ఇచ్చి.. వేల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. ఒక్క నల్గొండ జిల్లాలోనే 14 వేల ఎకరాల్లో సర్వే చేస్తే 4 వేల ఎకరాలకు దొంగపట్టాలు ఉన్నాయి. అసలు అసెంబ్లీ ఇక్కడ నిర్వహిస్తుంటే.. మాక్ అసెంబ్లీ ఎందుకు? అసెంబ్లీకి రాకుండా మాక్ అసెంబ్లీ పెట్టుకొని అక్కడ డ్రామాలు ఆడుతున్నారు. చేసిన తప్పు ఒప్పుకొంటే ఇక్కడే ఉండేవారు కదా. ఒక్క రోజులోనే మ్యుటేషన్ చేయడం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయి. ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80కి బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టాం.

*** బీఆర్ఎస్ ఆ సమస్యను ఎందుకు పరిష్కరించలేదు?**

25 వేల ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్న మాట వాస్తవం. కొన్ని దశాబ్దాల క్రితం వారు అసైన్డ్ భూముల్లో ఇల్లు కట్టుకున్నది వాస్తవం. పేదల సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం అసైన్డ్ భూములు ఇచ్చింది. అసైన్డ్ భూముల విషయంలో ఏం చేయాలో సలహాలు ఇవ్వాలి. అసైన్డ్ భూములు ఉమ్మడి రాష్ట్రం నుంచే నిషేధిత జాబితాలో ఉన్నాయి. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదు" అని పొంగులేటి ప్రశ్నించారు.

*** 22ఏ నుంచి తొలగించి పేదలకు ఇచ్చాం**



ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పొంగులేటి సభకు వివరించారు. "22ఏలోని ప్రభుత్వ వ్యవసాయ భూములు: 96,36,777 ఎకరాలు. ప్రైవేటు వ్యవసాయ భూమి: 3,73,930 ఎకరాలు. వ్యవసాయేతర భూమి: 1,94,543 ఎకరాలు. ఇవి కాకుండా ఎండోమెంట్ భూములు 5,12,792 ఎకరాలు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి, ఇప్పటికి నిషేధిత జాబితాలోని భూమి 47,440 ఎకరాలు తగ్గింది. 23వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇచ్చాం. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి.. మరో 20వేల ఎకరాలను 22ఏ నుంచి తొలగించాం. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాల్లో ప్రతి ఎకరాకు లెక్కలు ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ చెప్పింది. భువనగిరిలో 25 వేల ఇళ్లు 22ఏలో ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఆయన చెప్పినవి అసైన్డ్ భూముల్లో ఉన్న ఇళ్లు. ఇబ్రహీంపట్నం పరిధి రాందాస్‌పల్లిలో 1300 ఎకరాల గురించి హరీశ్‌రావు మాట్లాడారు. ఆ భూమి దశాబ్దాలుగా నిషేధిత జాబితాలోనే ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అప్పుడు ఎందుకు పట్టించుకోలేదు" అని పొంగులేటి నిలదీశారు.

## హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్: నగరాన్ని బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లును తెలంగాణ శాసనసభ లో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని తెలిపారు. హైదరాబాద్ విస్తరణ పెద్దఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం రూపొందించామని చెప్పారు. "మూసీ పునరుజ్జీవం తొలిదశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చాం. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాం. జీహెచ్ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నాం. అన్ని సంస్థలు సమన్వయంతో పనిచేసేలా చట్టబద్ధ వ్యవస్థను రూపొందించాం. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలిని ఏర్పాటుచేస్తున్నాం. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక. మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలని ప్రభుత్వ యోచన. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నాం. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా



తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలి. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం చేరుకోవాలి. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయాలి" అని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో చిన్నపాటి సాంకేతికపరమైన 400 రకాల నేరాలను..నేరపూరిత పరిధి నుంచి తొలగించాలని మంత్రి శ్రీధర్‌బాబు సభలో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా వ్యాపార నిర్వహణ మరింత సులభతరమవుతుందని తెలిపారు. చాలా కేసుల్లో చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టం అందరికీ ఉపయోగపడాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. ఈ చట్టాలకు సంబంధించి కలెక్టర్లు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు.

## గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై కారు బోల్తా.. ఇద్దరు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

పెనుబల్లి : పెనుబల్లి మండల పరిధిలోని ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారిలోని పెనుబల్లి కల్లూరు మండలాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన ఓ కుటుంబం శుభకార్యం నిమిత్తం బంగారం, దుస్తులు కొనేందుకు




ఉదయం ఖమ్మం వెళ్లారు. తిరిగి కారులో గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో వస్తుండగా కల్లూరు మండలం వెంకటాపురం సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. దీంతో ఉషారాణి, కారు డ్రైవర్ అక్కడికక్కడే మరణించారు. మృతురాలు ఏపీలోని చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన కొల్లి ఉషారాణి(56)కాగా మరొకరు కారు డ్రైవర్. తీవ్రంగా గాయపడిన వారిలో సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన పుచ్చకాయల సీతామహాలక్ష్మి, పుచ్చకాయల శేషు, గోలీ రాజేశ్వరి ఉన్నారు. క్షతగాత్రులను పెనుబల్లి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని సత్తుపల్లి గ్రామీణ సీఐ ముత్తిలింగం, వీఎం బంజర్ షాకీర్ పరిశీలించి సహాయక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం పెనుబల్లి వైద్యశాలకు తరలించారు.



## తెలంగాణలో పలుచోట్ల విస్తారంగా వర్షాలు

హైదరాబాద్: ఉత్తర బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ చోట్ల కురిసిన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ వెల్లడించింది. మంచిర్యాల జిల్లా కన్నేపల్లిలో అత్యధికంగా 135.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుమురం భీం జిల్లా రెబ్బెనలో 96.3 మి.మీ, వరంగల్ జిల్లా రాయపర్తిలో 95.8 మి.మీ, వర్ధన్నపేటలో 82.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఆదివారం కూడా పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# బ్రిక్స్ డిక్లరేషన్.. సభ్యదేశాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం

బ్రిక్స్ డిక్లరేషన్ కోసం సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. దేశం పేరును ప్రస్తావించకుండా.. ఏ దేశమైనా చేసే ఏకపక్ష యుద్ధాన్ని ఖండించే ఉమ్మడి ప్రకటనను వెలువరించడానికి బ్రిక్స్ దేశాల కూటమి అంగీకరించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య నెలకొన్న విభేదాలను తొలగించడానికి సభ్య దేశాల ప్రతినిధులు కృషి చేసేలా చర్చలు జరుగుతున్నాయి. అనంతరం బ్రిక్స్ దేశాల అధినేతలు ఏకాభిప్రాయ ప్రకటనను ఆమోదించే అవకాశం ఉంది. బ్రిక్స్ అధినేతలు దేశాల మధ్య ఆర్థిక సహకారం, ఇంధనం, ఆహార భద్రత, సాంకేతికత, ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు వంటి విషయాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. అమెరికా డాలర్ పై ఆధారపడటాన్ని తగ్గించి, వాణిజ్యం సహా ఇతర



చెల్లింపులలో తమ సొంత కరెన్సీల వాడకాన్ని పెంచడాన్ని ప్రోత్సహించడంపైనా సభ్యదేశాలు దృష్టిపెట్టనున్నాయి. ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని తగ్గించడానికి.. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ కీలకమైన సాధనమని చైనా, రష్యా భావిస్తున్నాయి.

## ఐరోపా దేశాలను మేం బెదిరించట్లేదు: పుతిన్

బ్రిక్స్ సదస్సు 2026 సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా ఎప్పుడూ ఐరోపాను బెదిరించలేదని.. భవిష్యత్తులోనూ బెదిరించబోదన్నారు. కానీ తమ దేశ ప్రయోజనాలకు, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటో విస్తరణ, ఐరోపా దేశాల జోక్యం వల్లే ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతోందంటూ వ్యాఖ్యానించారు. 'ఐరోపా దేశాలను బెదిరించాలని మేం ఎందుకు అనుకుంటాం? రెండో ప్రపంచ యుద్ధం



తర్వాత అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. ఆ తర్వాత జరిగిందంతా రష్యన్ ఫెడరేషన్ సమ్మతితోనే జరిగింది. కానీ ఐరోపా దేశాల నేతలు ఇప్పుడు ఉక్రెయిన్‌లోకి మరింత మంది సైన్యాన్ని పంపడానికి చర్చలు జరుపుతున్నారు. అంటే వారు మాతో యుద్ధాన్ని కోరుకుంటున్నారు. వారి వల్లే యుద్ధం కొసాగుతోంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో.. ప్రపంచ దేశాల ఇంధన, ఆహార భద్రతకు సహకరించడానికి రష్యా సిద్ధంగా ఉంది. అంతేకాకుండా పర్యాటకం, పరిశ్రమలు, వాణిజ్యం వంటి రంగాల్లో ఆసక్తికర కార్యక్రమాలకు రష్యా తలుపులు తెరిచే ఉంటాయి. బ్రిక్స్ దేశాలన్నింటికీ చైతన్యవంతమైన, శక్తిమంతమైన దేశీయ మార్కెట్లు ఉన్నాయి. బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదు. అదే విధంగా యావత్ ప్రపంచంతో కలిసి పనిచేయడానికి మాస్కో సిద్ధంగా ఉంది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం' అని పుతిన్ పేర్కొన్నారు.

## లాల్‌బాగ్‌చా ప్రసాద వ్యర్థాలు.. ఆ ఆస్పత్రులకు వెలుగునిస్తాయి..!

ముంబయిలో అత్యంత ప్రాచుర్యం పొందిన లాల్‌బాగ్‌చా రాజా గణపతి నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. 1934 నుంచి లాల్‌బాగ్‌చా మార్కెట్‌లో కొలువుదీరే ఈ గణనాథుడి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. ఇక్కడికి పెద్ద సంఖ్యలో సినీ, రాజకీయ ప్రముఖులు వస్తుంటారు. ఈ సారి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తోన్న బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. మండపం వద్ద ఆహార వ్యర్థాలను విద్యుత్‌గా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపింది. నవరాత్రి సమయంలో ఈ మండపం వద్ద రోజుకు 810 టన్నుల సేంద్రీయ వ్యర్థాలు పేరుకుంటాయి. ఆ వ్యర్థాలను బయో ఎలక్ట్రిసిటీ గా మార్చి, స్థానిక ఆస్పత్రులలో విద్యుత్ ఉత్పత్తికి వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. లాల్‌బాగ్‌చా రాజా సార్వజనిక్ గణేశోత్సవ్ మండలికి చెందిన సామూహిక వంటశాల నుంచి వచ్చే ఆహార, ప్రసాద వ్యర్థాలను సేకరించి.. స్థానిక నాయర్, కస్తూర్బా, జీటీబీ, సియాన్ ఆస్పత్రులలోని బయోమీథేనేషన్ ప్లాంట్‌లకు తరలించనున్నారు. ఈ వ్యర్థాల నుంచి దాదాపు 7,744 యూనిట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విద్యుత్‌ను నాలుగు ఆస్పత్రులలోని ఇన్‌పేషెంట్ వార్డులు, కారిడార్లలో లైటింగ్ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల రీసైకిల్.. కృత్రిమ నిమజ్జన





చెరువులు, తాత్కాలిక ట్యాంకులు, ఇతర జలాశయాలలో నిమజ్జనం చేసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలను మొట్టమొదటిసారిగా బీఎంసీ రీసైకిల్ చేయనుంది. ఈ విగ్రహాలను వెలికితీయడం, రీసైకిల్ చేయడం కోసం ఏర్పాట్లు చేస్తోంది. బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియను నిమజ్జనం జరిగిన 24 గంటలలోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వాటి నుంచి వచ్చిన వ్యర్థ పదార్థాలను విగ్రహాల తయారీ, ప్లాస్టర్ బోర్డులు, సిరామిక్స్, ఇటుకలు, సిమెంట్ పరిశ్రమలలో ఫిల్లర్ మెటీరియల్‌గా తిరిగి ఉపయోగించే అవకాశం ఉంది.

## పీఏ ఇంట్లో బంగారం, డబ్బు సీజ్.. కాంగ్రెస్ పదవులను వీడిన మాజీ సీఎం

ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావత్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన రెండు పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన పీఏ చందన్ సింగ్ జీనా ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరాఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత ఆహ్వానితుడి పదవుల నుంచి వైదొలిగారు. ఎన్నికల వేళ.. తన వల్ల పార్టీకి ఇబ్బంది కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రావత్ తెలిపారు. ఈడీ గురువారం డెహ్రాడూన్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు చేసింది. 2016లో



ఉత్తరాఖండ్ సబార్డినేట్ సర్వీస్ సెలక్షన్ కమిషన్ నియామక పరీక్షలో ఓఎంఆర్ షీట్లను మార్చి అక్రమాలకు పాల్పడ్డారని జీనాపై నమోదైన కేసుకు సంబంధించి ఈ చర్యలు చేపట్టింది. జీనా నివాసంలో రూ.32 లక్షల నగదు, సుమారు 200 గ్రాముల బంగారు నాణేలు, ఆభరణాలు, 12 ఖరీదైన గడియారాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ (ED) తెలిపింది. జీనా, ఆయన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లోని రూ.52.16 లక్షలను స్తంభింపజేసింది. అయితే.. జీనాపై వచ్చిన ఆరోపణలను తాను నమ్మడం లేదని.. అతను బాగా కష్టపడి పనిచేసే వ్యక్తి అని రావత్ చెప్పారు. ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గతంలో రావత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీనా ఓఎస్డీగా పనిచేశారు. ఆ తర్వాత పీఏగా కొనసాగుతున్నారు. ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ పరిణామం ఎలా ప్రభావం చూపుతోందో చూడాల్సి ఉంది.



## ఖైరతాబాద్ వినాయకుడు..
## నేటి నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు

- **భక్తుల దర్శనానికి సిద్ధమవుతున్న ఖైరతాబాద్ వినాయకుడు**
- **భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ ఆంక్షలు**
- **ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు భక్తులు సహకరించాలని కోరిన పోలీసులు**

హైదరాబాద్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ బడా గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ కీలక ఆంక్షలు ప్రకటించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 12వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు వివరాలు:**

- రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్: పీవీ విగ్రహం వైపు నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా మింట్‌కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిరంకారి జంక్షన్ వైపు మళ్లిస్తారు.
- రాజ్‌దూత్ లేన్: రాజ్‌దూత్ లేన్ మీదుగా బడా గణేశ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఇక్బాల్ మినార్ వైపు పంపిస్తారు.
- మింట్ కాంపౌండ్: మింట్ కాంపౌండ్ మీదుగా ఐమాక్స్ వైపు వెళ్లే వాహనాలను మింట్ కాంపౌండ్ లైన్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు, మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను నెక్లెస్ రోటరీ వద్ద సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లిస్తారు.
- ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ దారి: ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ లేన్ మీదుగా రైల్వేగేటు వైపు వెళ్లే వాహనాలను పోస్ట్‌ఆఫీసు జంక్షన్ వద్ద పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ జంక్షన్ వైపు పంపిస్తారు.

* **భక్తుల వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలు:**

నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను రేస్ కోర్సు రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలంతో పాటు ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను విశ్వేశ్వరయ్య భవన్ ప్రాంగణంలో పార్కింగ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. గణేశ్ నిమజ్జన ఉత్సవాలు పూర్తయ్యే వరకు వాహనదారులు, భక్తులు ఈ ఆంక్షలకు సహకరించాలని కోరారు.

## రెండు ఆహార ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా..
## వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆదేశం

- **షాలిమార్స్ ధనియాల పొడిలో అధిక మోతాదులో పురుగుమందుల అవశేషాలు**
- **ఆక్వాగ్రి క్యారెజీనన్‌లో ప్రమాదకరమైన కాడ్మియం ఉన్నట్లు గుర్తింపు**
- **కంపెనీల అప్పీల్ తర్వాత రీ-టెస్టుల్లోనూ ఉత్పత్తులు సురక్షితం కావని నిర్ధారణ**
- **ఫుడ్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తున్నందున తక్షణ చర్యలు**

రెండు ప్రముఖ కంపెనీలకు చెందిన ఆహార ఉత్పత్తులు వినియోగదారుల ఆరోగ్యానికి సురక్షితం కావని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) శనివారం వెల్లడించింది. ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమవడంతో, వాటిని తక్షణమే మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని (రీకాల్) సదరు కంపెనీలను ఆదేశించింది. నీలగిరి ఆయిల్ అండ్ అల్లైడ్ ఇండస్ట్రీస్‌కు చెందిన 'షాలిమార్స్ చెఫ్ కొరియాండర్ పౌడర్', ఆక్వాగ్రి ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 'క్యారెజీనన్' ఉత్పత్తులను నిలిపివేయాలని స్పష్టం చేసింది. నీల్‌గిరి ఆయిల్ కంపెనీ ప్రాంగణం నుంచి సేకరించిన 'షాలిమార్స్ చెఫ్' ధనియాల పొడి నమూనాలను పరీక్షించగా, అందులో అనుమతించిన పరిమితికి మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు తేలింది. దీంతో ఈ ఉత్పత్తి ఆరోగ్యానికి సురక్షితం కాదని అధికారులు వర్గీకరించారు. అయితే, అధికారుల నిర్ణయంపై సదరు కంపెనీ అప్పీల్ చేయడంతో మరోసారి పరీక్షలు నిర్వహించగా, అప్పుడు కూడా ఫలితాల్లో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో ఈ ఉత్పత్తి ప్రమాదకరమైనదేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ పునరుద్ఘాటించింది. మరో కేసులో, ఆక్వాగ్రి ప్రాసెసింగ్ సంస్థ నుంచి సేకరించిన 'క్యారెజీనన్ (ఎర్రసముద్రం నుంచి సేకరించిన సీవీడ్ ఉత్పత్తి)' నమూనాలో అనుమతించిన స్థాయి కంటే ఎక్కువగా కాడ్మియం ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ కంపెనీ కూడా అప్పీల్ చేయగా, రిఫరల్ ల్యాబొరేటరీలో జరిపిన రీటెస్టింగ్‌లోనూ సదరు ఉత్పత్తి సురక్షితం కాదని తేలింది. ఈ రెండు ఉత్పత్తులు ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ రీకాల్ ప్రొసీజర్) రెగ్యులేషన్స్, 2017 ప్రకారం, ఈ ఉత్పత్తులను మార్కెట్ నుంచి తక్షణమే ఉపసంహరించుకోవాలని సంబంధిత కంపెనీలను ఆదేశించింది.

## 9/11 దాడులకు 25ఏళ్లు.. లాడెన్ కొడుకు వీడియో విడుదల చేసిన అల్‌ఖైదా

అమెరికాతో పాటు యావత్ ప్రపంచాన్ని వణికించిన 9/11 ఉగ్ర దాడులకు శుక్రవారంతో పాతికేళ్లు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ కేంద్రంగా ఉన్న ఉగ్రసంస్థ అల్‌ఖైదా (Al Qaeda) ఓ వీడియో రిలీజ్ చేసింది. అందులో ఉగ్రసంస్థ మాజీ అధిపతి ఒసామా బిన్ లాడెన్ కొడుకు హమ్జా బిన్ లాడెన్ మాట్లాడుతోన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. 2019లో అఫ్గాన్‌పాక్ సరిహద్దులో అమెరికా జరిపిన ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌లో హమ్జా మరణించినట్లు వార్తలు వచ్చాయి. అయితే.. 2025లో వెలువడిన పలు నిఘా నివేదికలు మాత్రం అతడు బతికే ఉన్నాడని పేర్కొన్నాయి. తాజాగా అల్‌ఖైదా అతడి వీడియో షేర్ చేయడంతో హమ్జా ప్రాణాలతోనే ఉన్నాడా.. అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లాడెన్ వారసుడిగా హమ్జాను ప్రకటించాలనే ఉద్దేశంతోనే ఈ వీడియోను షేర్ చేసినట్లు తెలుస్తోంది. 9/11 ఉగ్ర దాడులు జరిగి 25



ఏళ్లు అయిన నేపథ్యంలో.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో అమెరికా రాయబారి మాట్లాడారు. ఈ దాడులకు కారణమైన ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను మనమంతా ఐక్యంగా వేటాడి పట్టుకున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పాక్ ప్రతినిధి మాట్లాడుతూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ దేశం పోరాడుతోందని చెప్పడం గమనార్హం. 2001 సెప్టెంబరు 11న అమెరికాలో అల్‌ఖైదా భీకర ఉగ్రదాడికి పాల్పడింది. దీనికి ప్రతీకారంగా 2011లో అమెరికా కీలక ఆపరేషన్ చేపట్టి.. పాకిస్థాన్‌లో దాక్కొన్న బిన్ లాడెన్‌ను హతమార్చింది.

## ఇరాక్ నుంచి దాడులు.. కీలక పైప్‌లైన్‌ను మూసివేసిన సౌదీ అరేబియా

- **సౌదీ అరేబియాలోని ఈస్ట్-వెస్ట్ చమురు పైప్‌లైన్‌పై డ్రోన్ దాడులు**
- **ముందుజాగ్రత్త చర్యగా పైప్‌లైన్ ద్వారా సరఫరాను నిలిపివేసిన ప్రభుత్వం**
- **ఈ దాడులు ఇరాక్ భూభాగం నుంచి జరిగాయని ఆరోపించిన సౌదీ**
- **ప్రతీకార చర్యలు వద్దన్న ఇరాక్ అభ్యర్థనకు సౌదీ తాత్కాలిక అంగీకారం**
- **ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన ఇరాక్ ప్రభుత్వం**

సౌదీ అరేబియాలోని కీలకమైన ఈస్ట్‌వెస్ట్ చమురు పైప్‌లైన్‌పై గురువారం ఉదయం పలు దాడులు జరిగాయి. దీంతో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా పైప్‌లైన్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ దాడులు ఇరాక్ భూభాగం నుంచి డ్రోన్ల ద్వారా జరిగాయని సౌదీ విదేశాంగ



శాఖ ఆరోపించింది. సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, రియాద్, మదీనా ప్రాంతాల గుండా వెళ్లే ఈ పైప్‌లైన్‌పై గురువారం దాడులు జరిగాయి. ఈ ఘటనలో పలువురు గాయపడగా, వారికి వైద్య సాయం అందిస్తున్నట్లు తెలిపింది. దాడుల అనంతరం అత్యవసర బృందాలు వెంటనే రంగంలోకి దిగి, పైప్‌లైన్ భద్రతను అంచనా వేస్తున్నాయని పేర్కొంది. మరోవైపు, ఈ డ్రోన్ దాడులు ఇరాక్ నుంచి జరిగాయని సౌదీ విదేశాంగ శాఖ శుక్రవారం స్పష్టం చేసింది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇరాక్ ప్రధాని అభ్యర్థన మేరకు ప్రస్తుతానికి ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోవడం లేదని వెల్లడించింది. తమ భూభాగం నుంచి దాడులు పునరావృతం కాకుండా నిరోధించేందుకు ఇరాక్ ప్రభుత్వానికి అవకాశం ఇస్తున్నట్లు పేర్కొంది. అదే సమయంలో, తమ సార్వభౌమత్వాన్ని, పౌరుల భద్రతను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని సౌదీ హెచ్చరించింది. సౌదీ నిర్ణయాన్ని ఇరాక్ స్వాగతించింది. తమ దేశం నుంచి సౌదీ భద్రతకు ముప్పు కలిగించే ఏ దాడినైనా ఖండిస్తున్నామని, దీనికి బాధ్యులైన వారిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు ఇరాక్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సౌదీ తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాల నుంచి ఎర్ర సముద్రంలోని యాన్బు నౌకాశ్రయానికి ముడి చమురును రవాణా చేసే ఈ ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్‌కు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యం ఉంది.




# టాటా సన్స్ NBFC సరెండర్ లైసెన్స్ రద్దు చేసిన ఆర్‌బీఐ!

టాటా సన్స్ తన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ లైసెన్స్‌ను స్వచ్ఛందంగా రద్దు చేసుకొనేందుకు పెట్టుకున్న దరఖాస్తును ఆర్‌బీఐ రద్దు చేసినట్లు తెలుస్తోంది. దీంతో కంపెనీ అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ నిబంధనలకు కట్టుబడి ఉండాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన లేఖను కంపెనీ సెక్రటరీ అండ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అందుకున్నట్లు కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనివల్ల టాటా సన్స్ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. జూన్ 1 నుంచి వచ్చిన నిబంధనల ప్రకారం.. రూ.లక్ష కోట్లు ఆస్తులు కలిగిన ఎన్‌బీఎఫ్‌సీని




అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా పరిగణిస్తారు. 2026 మార్చి నాటికి టాటా సన్స్ ఆస్తుల విలువ రూ.2 లక్షల కోట్లకు పైబడి ఉండడంతో దీన్ని అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా ఆర్‌బీఐ గుర్తించింది. ఇలా గుర్తింపు పొందిన కంపెనీ మూడేళ్లలోపు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సి ఉంటుంది. టాటా గ్రూప్ కంపెనీలకు ఎన్‌బీఎఫ్‌సీ కేటగిరీలో టాటా సన్స్ ప్రధాన పెట్టుబడి కంపెనీగా ఉంది. లిస్టింగ్ నుంచి తప్పించుకోవడం కోసం పెట్టుబడి కంపెనీగా డీరిజిస్టర్ చేయాలంటూ టాటా సన్స్ గతంలో ఆర్‌బీఐకి దరఖాస్తు చేసుకుంది. తాజాగా ఈ దరఖాస్తును ఆర్‌బీఐ తిరస్కరించినట్లు తెలుస్తోంది. అయితే, తాజాగా వస్తున్న ఈ వార్తలపై ఆర్‌బీఐ కానీ, టాటా సన్స్ కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## జొమాటో మరో షాక్..
# క్యాష్ ఆన్ డెలివరీపై ఫీజు!

ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మరో షాకిచ్చింది . క్యాష్ ఆన్ డెలివరీలపై అదనంగా రూ.5 ఛార్జీ వసూలు చేస్తోంది. ఇప్పటికే కంపెనీ బిల్ సమ్మరీలో ఈ ఛార్జీలు కనిపిస్తున్నాయి. ఆదాయాన్ని మెరుగుపరుచుకోవడం, డిజిటల్ పేమెంట్ల వైపు వినియోగదారులను




మళ్లించేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫుడ్ ఆర్డర్లపై ప్లాట్‌ఫాం ఫీజు, రెస్టరెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు, జీఎస్‌టీని జొమాటో వసూలు చేస్తుంది. దీనికి సీఓడీ ఛార్జీలు అదనపు భారం. ఆన్‌లైన్ పేమెంట్లు చేసే కస్టమర్లకు ఈ ఛార్జీలు వర్తించవు. కాగా, జొమాటో ఇటీవలే తన ప్లాట్‌ఫాం ఫీజును పెంచిన విషయం తెలిసిందే. వినియోగదారుడి ఒక్కో ఆర్డర్‌కు ఫీజును రూ.12.50 నుంచి రూ.14.90కి సవరించింది. ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రమవుతోంది. ర్యాపిడో ఓన్లీ, ఫ్లిప్‌కార్ట్ ఈట్ ఇన్ ఫుడ్ డెలివరీ సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించాయి. దీంతో ఈ రంగంలో ఉన్న జొమాటో, స్విగ్గీకి గట్టి పోటీ ఎదురవుతోంది. కంపెనీ లాభాల్ని పెంచుకోవడానికి జొమాటో సీఓడీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

# ఫాస్టాగ్ వినియోగదారులకు శుభవార్త.. వాహనంపై ఉన్న ట్యాగ్ ఎప్పటికీ అలాగే!

ఫాస్టాగ్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇకపై ఫాస్టాగ్‌కు అనుసంధానమైన బ్యాంకును మార్చుకోవాలంటే.. వాహనంపై ఉన్న ట్యాగ్‌ను తొలగించి కొత్తది తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. 'వన్‌ట్యాగ్' విధానాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ప్రారంభించారు. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో ఈ సేవ పనిచేస్తుంది. ప్రస్తుత బ్యాంకు సేవలు నచ్చకపోతే మరో బ్యాంకుకు ఫాస్టాగ్ ఖాతాను మార్చుకోవచ్చు. వాహనంపై ఉన్న ట్యాగ్ మాత్రం అలాగే ఉంటుంది. ఈ మార్పు ప్రక్రియను రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ , ఐసీఐసీఐ , ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సహా పలు సంస్థలు ఇప్పటికే ఈ విధానంలో భాగమయ్యాయి. ఫాస్టాగ్ సేవల మార్పులో వాహనదారులకు ఎదురవుతోన్న ఇబ్బందులను తగ్గించడమే వన్‌ట్యాగ్ విధానం




లక్ష్యమని గడ్కరీ తెలిపారు. గతంలో బ్యాంకు మార్చాలంటే పాత ఫాస్టాగ్ ఖాతాను మూసివేసి.. కొత్త ట్యాగ్ తీసుకోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

**ప్రక్రియ ఇలా..**

1. ప్లే స్టోర్ నుంచి రాజ్‌మార్గ్‌యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవ్వాలి.
2. యాప్‌లో ఫాస్టాగ్/వన్‌ట్యాగ్ సేవను ఎంచుకోవాలి.
3. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ వివరాలు నమోదు చేయాలి.
4. బ్యాంకు మార్చే (Port FASTag) ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
5. కొత్తగా ఎంచుకున్న బ్యాంకును ఎంపిక చేసి.. అవసరమైన వివరాలు సమర్పించాలి.
6. ధ్రువీకరణ పూర్తయిన తర్వాత ఫాస్టాగ్ కొత్త బ్యాంకుకు పోర్ట్ అవుతుంది. తదనంతరం వాహనంపై ఉన్న పాత ట్యాగ్‌నే కొనసాగించవచ్చు.

# మడతబెట్టే ఫోన్.. యాపిల్ నుంచి రూ.23 వేలు వసూలు చేస్తోన్న శాంసంగ్!



''మేం వదిలేసిన పదార్థాలను మీరు వేడిచేయడం పూర్తయితే మాకు చెప్పండి'' అంటూ ఐఫోన్ డ్యూయో ఫోన్లను ఉద్దేశించి శాంసంగ్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాము ఫోల్డబుల్ ఫోన్లు తీసుకువచ్చిన తర్వాత యాపిల్ వీటిని ఆవిష్కరించడంతో ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే.. ఈ ప్రత్యర్థులు ఇద్దరూ కలిసి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఐఫోన్ డ్యూయో ఫోన్ల డిస్‌ప్లేకు సంబంధించి కీలక స్క్రీన్ విభాగాన్ని శాంసంగ్ అందిస్తోందని సమాచారం. అందుకోసం మూడేళ్లకు ఒప్పందం కుదుర్చుకుందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఒక్కో ఇన్నర్ ఫోల్డింగ్ డిస్‌ప్లే ప్యానెల్‌కు 250 డాలర్ల (రూ.23,899) చొప్పున వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఇదే నిజమైతే.. ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి యాపిల్ ప్రవేశించడంలో ఈ ఒప్పందం కీలకమనే చెప్పాలి. ఈ కొత్తరకం ఫోన్లలో ఇన్నర్ డిస్‌ప్లే సాంకేతికంగా ప్రధానమైంది. పదేపదే ఫోన్ మడిచినా.. రంగు ఏమాత్రం చెడకుండా, ఎక్కువకాలం మన్నేందుకు ఉపయోగపడుతుంది. యాపిల్ (Apple) కు డిస్‌ప్లేలను సరఫరా చేసే కంపెనీలు ప్రస్తుత సాంకేతిక అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తులను సిద్ధం చేయకపోవడంతో శాంసంగ్ (Samsung)తో ఒప్పందం చేసుకున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలపై యాపిల్ నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేదు.

# టెస్టు క్రికెట్.. సచిన్ రికార్డును బ్రేక్ చేసిన జో రూట్

ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ (62*; 69 బంతుల్లో) అర్ధ శతకం సాధించాడు. ఈ క్రమంలో టెస్టు క్రికెట్ లో అత్యధిక అర్ధశతకాలు చేసిన సచిన్ తెందుల్కర్ (Sachin) రికార్డును జో రూట్ బద్దలు కొట్టాడు. సచిన్ 329 ఇన్నింగ్స్‌ల్లో 68 హాఫ్ సెంచరీలు చేయగా.. జో రూట్ 309 ఇన్నింగ్స్‌ల్లోనే 69 అర్ధ శతకాలు చేయడం విశేషం. ఈ జాబితాలో శివనారాయణ్ చందర్‌పాల్ (66), అలెన్ బోర్డర్, రాహుల్ ద్రవిడ్ (63), రికీ పాంటింగ్ (62) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఎడ్జ్‌బాస్టన్‌లో 1,000కి పైగా టెస్టు పరుగులు సాధించిన తొలి బ్యాటర్‌గానూ రూట్ (Joe Root) రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు లార్డ్స్ (2,203 పరుగులు), మాంచెస్టర్ (1,128 పరుగులు), ది ఓవల్ (1,050 పరుగులు) మైదానాల్లోనూ అతను వెయ్యి కంటే ఎక్కువ రన్స్ చేశాడు. దీంతో నాలుగు వేర్వేరు మైదానాల్లో 1,000కి పైగా టెస్ట్ పరుగులు సాధించిన దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌ల సరసన రూట్ చేరాడు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో



35ఏళ్ల జో రూట్ (14,278 రన్స్) రెండో స్థానంలో ఉన్నాడు. సచిన్ తెందుల్కర్ (15,921) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.




# ప్లేయర్లను మార్చినా.. పాక్ ఫేట్ మారలేదు

ఇంగ్లాండ్ గడ్డపై పాకిస్థాన్ జట్టు(Pakistan Cricket Team)కు వైట్‌వాష్ తప్పలేదు. మూడు టెస్టుల సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఘోరంగా ఓడిన పాక్.. మూడో టెస్టులో గెలిచి పరువు కాపాడుకోవాలనే ఉద్దేశంతో హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌లపై వేటు వేసింది. ఏడుగురు ఆటగాళ్లనూ జట్టు నుంచి రిలీజ్ చేసి కొత్తవారిని తీసుకుంది. ఇలా ఎన్ని ప్రయోగాలు చేసినా పాకిస్థాన్‌కు మళ్లీ పరాభవమే ఎదురైంది. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జరిగిన మూడో టెస్టులో పాక్‌పై ఆతిథ్య ఇంగ్లాండ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే కుప్పకూలిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో పోరాడి 449 పరుగులు చేసింది. ఈ క్రమంలో 129 పరుగుల ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌ను నాలుగో రోజుకు తీసుకెళ్లింది. 130 పరుగుల లక్ష్యంతో శనివారం ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ (England) రెండు వికెట్లు కోల్పోయి 24.2 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు బెన్ డకెట్, ఎమిలియో గే.. ఇద్దరూ డకౌట్ అయినా జోర్డాన్ కాక్స్ (59*; 76 బంతుల్లో), జో రూట్ (62*; 69 బంతుల్లో) అర్ధ శతకాలు బాది జట్టును గెలిపించారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 453 పరుగులకు




ఆలౌటైంది.

## శ్రీలంకపై ప్రతీకారం తీర్చుకొని..
# ఎనిమిదోసారి భారత్ ఛాంపియన్ అవుతుందా?

మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్ ఆదివారం జరగనుంది. ఈ తుది పోరులో భారత్‌తో శ్రీలంక తలపడనుంది. ప్రస్తుత బలాబలాలు, గత రికార్డులను బట్టి చూస్తే ఫైనల్‌లో టీమ్‌ఇండియానే టైటిల్ ఫేవరెట్. కానీ, ప్రస్తుతం టోర్నీ టీ20 ఫార్మాట్‌లో జరుగుతుండటంతో లంకేయులను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. 2024లో శ్రీలంక ఈ ఫార్మాట్‌లోనే టీమ్‌ఇండియా ను ఓడించి తొలిసారి ఆసియా కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. మొత్తంగా ఇప్పటివరకు ఏడు పర్యాయాలు విజేతగా నిలిచిన




భారత్.. మరి ఈసారి ఎనిమిదో టైటిల్‌ని సొంతం చేసుకుంటుందా? మీ అభిప్రాయాన్ని పోల్‌లో తెలియజేయండి.




# ప్లేయర్లను మార్చినా.. పాక్ ఫేట్ మారలేదు

బర్మింగ్‌హామ్: ఇంగ్లాండ్ గడ్డపై పాకిస్థాన్ జట్టు కు వైట్‌వాష్ తప్పలేదు. మూడు టెస్టుల సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఘోరంగా ఓడిన పాక్.. మూడో టెస్టులో గెలిచి పరువు కాపాడుకోవాలనే ఉద్దేశంతో హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌లపై వేటు వేసింది. ఏడుగురు ఆటగాళ్లనూ జట్టు నుంచి రిలీజ్ చేసి కొత్తవారిని తీసుకుంది. ఇలా ఎన్ని ప్రయోగాలు చేసినా పాకిస్థాన్‌కు మళ్లీ పరాభవమే ఎదురైంది. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జరిగిన మూడో టెస్టులో పాక్‌పై ఆతిథ్య ఇంగ్లాండ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే కుప్పకూలిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో పోరాడి 449 పరుగులు చేసింది. ఈ క్రమంలో 129 పరుగుల ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌ను నాలుగో రోజుకు తీసుకెళ్లింది. 130 పరుగుల లక్ష్యంతో శనివారం ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండు వికెట్లు కోల్పోయి 24.2 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు బెన్ డకెట్, ఎమిలియో గే.. ఇద్దరూ డకౌట్ అయినా జోర్డాన్ కాక్స్ (59*; 76 బంతుల్లో), జో రూట్ (62*; 69 బంతుల్లో) అర్ధ శతకాలు బాది జట్టును గెలిపించారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 453 పరుగులకు ఆలౌటైంది.

# మళ్లీ భారత్ పాక్ పోరు.. గతేడాది రెండుసార్లు బహిష్కరించాం.. మరి ఈసారి?

ఇది సూపర్ సీనియర్ల పోరు అంటే మాజీ క్రికెటర్లు బరిలోకి దిగే టోర్నీ అన్నమాట. అంతా స్టార్లే. భారత్ తరఫున యువరాజ్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, శిఖర్ ధావన్ వంటి ప్లేయర్లు బరిలోకి దిగుతారు. ఇక్కడా భారత్ పాకిస్థాన్ పోరంటే అభిమానుల్లో ఆసక్తి ఎక్కువే. కానీ, గత సీజన్‌లో రెండుసార్లు పాక్‌తో తలపడేందుకు టీమ్‌ఇండియా ఆటగాళ్లు విముఖత చూపించారు. మరోసారి ఇరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. ఈసారి ఏమవుతుందో చూడాలి. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ మూడో సీజన్ అక్టోబర్ 3 నుంచి 18 వరకు జరగనుంది. దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో భారత్ పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 10న జరగనుంది. యువరాజ్ సింగ్, షాహిద్ అఫ్రిది, గేల్, ఏబీ డివిలియర్స్, మహ్మదుల్లా రియాద్, డేవిడ్ వార్నర్, మొయిన్ అలీ సారథ్యంలోని ఏడు దేశాలు తలపడతాయి.

**గత ఎడిషన్‌లో ఏమైందంటే?**



డబ్ల్యూసీఎల్ 2025 సీజన్‌లో భారత్ పాక్ జట్ల మధ్య రెండు మ్యాచులు జరగాల్సింది. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా పాకిస్థాన్‌తో ఆడేందుకు టీమ్‌ఇండియా మాజీలు ఆసక్తి చూపించలేదు. ఆ మ్యాచులను బహిష్కరించారు. అందులో ఒకటి గ్రూప్ స్టేజ్‌లో కాగా.. మరోసారి సెమీస్‌లో ఎదురయ్యాయి. ఇందులో గెలిస్తే ఫైనల్‌కు చేరుకొనేందుకు భారత్ అవకాశం ఉంది. అయితే.. తమకు కప్ కంటే భారత ప్రజల మనోభావాలే ముఖ్యమని భావించిన భారత ఆటగాళ్లు సెమీస్‌లోనూ ఆడకుండా ఉండిపోయారు.



## ఆ పాత్ర కోసం స్పెషల్ ట్రైనింగ్

దిగ్గజ సంగీత కళాకారిణి ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా ఓ పాన్ ఇండియన్ మూవీ రాబోతుంది. ఇందులో ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక మందన్న కనిపించబోతుంది. ఈ పాత్ర కోసం రష్మిక స్పెషల్ ట్రైనింగ్ తీసుకోబోతున్నట్లు సమాచారం. కట్టుబొట్టు విషయంలోనే కాకుండా వీణ పట్టుకోవడం, మ్యానరిజమ్స్, మాటతీరు అన్ని సుబ్బులక్ష్మిలాగే ఉండేలా రష్మిక జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. కొన్నాళ్లు శిక్షణ తీసుకున్న తర్వాతే షూటింగ్‌ను మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. కర్ణాటక సంగీతకళాకారిణిలతో కలిసి ఓ స్పెషల్ వర్క్‌షాప్‌ను నిర్వహించబోతున్నట్లు సమాచారం. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీవాస్ ఈ మూవీని నిర్మిస్తున్నారు.

## గెస్ట్ రోల్‌లో విరుష్క జోడి

బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మూవీ హనుమాన్ అంశ్‌కు సీక్వెల్ రాబోతుంది. ఆధ్యాత్మిక గురువు కరోలీ బాబా జీవితం ఆధారంగా రూపొందిన ఈ మూవీ సీక్వెల్‌లో విరాట్ కోహ్లి, అనుష్క శర్మ గెస్ట్ రోల్స్‌లో కనిపించబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ సీక్వెల్‌లో నటించడానికి వీరిద్దరు అంగీకరించినట్లు చెబుతోన్నారు. పార్ట్ 2ను దర్శకనిర్మాతలు అఫీషియల్‌గా ప్రకటించారు. కోహ్లి, అనుష్క పాత్రలు హైలైట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. బాబా ఆధ్యాత్మిక బోధనల ప్రభావం వీరిద్దరి జీవితాల్లో ఎలాంటి మార్పులను తీసుకొచ్చాయన్నది చూపించబోతున్నట్లు తెలిసింది. అనుష్క శర్మ పాత్ర నిడివి ఎక్కువగానే ఉండబోతున్నట్లు చెబుతున్నారు. వీరితో పాటు హాలీవుడ్ హీరోయిన్ జులియా రాబర్ట్స్ కూడా అతిథిగా కనిపించే అవకాశం ఉందని సమాచారం.




## నేరుగా ఓటీటీలోకి కాశీ మజిలీ

మూడేళ్ల గ్యాప్ తర్వాత యాక్టర్‌గా రేణుదేశాయ్ రీఎంట్రీ ఇస్తోంది. కాశీ మజిలీ పేరుతో ఓ మినీ మూవీ చేసింది. హీరోయిన్‌గా నటిస్తూనే ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా రేణుదేశాయ్ అందించారు. కానీ ఈ సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కాబోతుంది. ఈ మూవీ ఈటీవీ విన్ ఓటీటీలో రేపటి నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ ట్రైలర్‌ను ఈటీవీ విన్ శనివారం రిలీజ్ చేసింది. కాశీ వచ్చిన ఓ మహిళ ఓ ఫొటోగ్రాఫర్‌తో కలిసి సాగించిన జర్నీ, ప్రేమ వంటి అంశాల చుట్టూ ఈ సినిమా సాగనున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. కాశీ విజువల్స్, మెలోడీ ప్రధానంగా సాగే మ్యూజిక్ ఆకట్టుకుంటున్నాయి. యమునా కిషోర్ దర్శకత్వం వహించగా జోశ్యభట్ల మ్యూజిక్ అందించారు.



## ఫ్యామిలీ ఇమేజుందని తెల్సు.. కానీ

వెంకటేష్ ఆదర్శ కుటుంబం మూవీ టీజర్ వచ్చేసింది. త్రివిక్రమ్ శైలి పంచ్‌లు, ఫ్యామిలీ ఎమోషన్స్, వెంకటేష్ కామెడీ టైమింగ్‌తో ఈ టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. భార్య చేసే అప్పుల కారణంగా ఇబ్బందులు పడే భర్తగా వెంకటేష్ కనిపించారు. డబ్బుకు సబ్బుకు ఓ పోలిక ఉంది. మొదటిది చూస్తుండగానే కరిగిపోతుంది. రెండోది ఆలోచించేలోపు అరిగిపోతుంది. నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని తెలుసు.. కానీ సిచ్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనుకాడను".. అంటూ వెంకటేష్ చెప్పిన డైలాగ్స్ హైలైట్‌గా నిలిచాయి. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోండగా తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. పోస్ట్‌పోన్ రూమర్లకు మేకర్స్ చెక్ పెడుతూ అక్టోబర్ 2నే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.



## లండన్‌లో విజయ్-త్రిష సందడి!

తమిళనాడు సీఎం దళపతి విజయ్, చెన్నై క్వీన్ త్రిష లండన్‌లో ఒకే వేదిక మరోసారి కలిసి కనిపించబోతున్నారా అంటే ఔననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. పెట్టుబడుల సేకరణ నిమిత్తం దళపతి విజయ్ ఇటీవలే లండన్ వెళ్లగా త్రిష హీరోయిన్‌గా చేస్తున్న ఓ సైకలాజికల్ హారర్ మూవీ షూటింగ్ కోసం లండన్‌లోనే ఉంది. వీరిద్దరూ ఓ ఈవెంట్‌లో సందడి చేయబోతున్నట్లు సమాచారం. శనివారం జరుగనున్న మిచెలిన్ లీ మాన్స్ కప్ మోటార్ రేసింగ్ పోటీల్లో అజిత్ పాల్గొంటున్నాడు. ఈ రేసింగ్ పోటీలకు చీఫ్ గెస్ట్‌గా విజయ్ అటెండ్ కాబోతున్నారు. ఈ వేడుకలకు త్రిష కూడా అటెండ్ కానున్నట్లు సమాచారం. విదేశాల్లో విజయ్, త్రిష ఒకే ఈవెంట్‌లో కలిసి కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తికరంగా మారింది. త్రిషతో దిగిన ఓ సెల్ఫీ ఫొటోను రాధిక ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

